సినిమా ప్రోగ్రాం

"చెప్తే వినరేంటి, సినిమా ఎప్పుడైనా చూడొచ్చు. ముందు షాప్‌కి వెళ్ళి చీరకొందాం రండి" అంది భార్య.

"ఆరునూరైనా ఈరోజు సినిమా చూడాల్సిందే...ఎప్పటికప్పుడు వాయిదా వేసుకుంటూ వస్తున్నాం కాదా, ఈరోజు సినిమా చూసేసి మరొకరోజు షాపింగ్‌కు వెళ్దాం" చెప్పాడు భర్త.

"నాకు తలనొప్పిగా ఉందండి, సినిమా చూస్తే మరికొంచెం పెరగొచ్చు. ఆతరువాత మీరు వంటచేయాల్సి ఉంటుంది." "ఓ పనిచెయ్యి, నువ్వు చీరకొనుక్కొని ఇంటికి వెళ్ళిపో, నేను సినిమా చూసి వస్తాను, సరేనా" తన ఆలోచనకు మురిసిపోతూ అన్నాడు భర్త.

"ఏడ్చినట్టే ఉంది. నేనొక్కదాన్నే ఇంటికి వెళ్లాలా? నాకు చచ్చేంత భయం".

"సమానహక్కులు అంటూ వీధుల కెక్కడం తెలుసుగాని మగాడి తోడు లేకుండా ఇంటికి మాత్రం వెళ్ళలేవు" నిష్ఠూరంగా అన్నాడు.

"సర్లెండి సంబడం, రండి" అంటూ క్లాత్‌షాప్‌లోనికి దారితీసింది.

మొహం వేలాడేసుకుంటూ భార్యామణిని అనుసరించాడు భర్త.

సాదరంగా ఆహ్వానించిన షాప్ ఓనరు రకరకాల చీరలు చూపించ సాగాడు.

"ఇది చూడండి అమ్మగారు, ఈ చీరలో మీరు బ్రహ్మాండంగా సినిమా హీరోయిన్‌లా ఉంటారు" ఖరీదైన ఆ చీరని అంటగట్టాలని చూస్తూ చెప్పాడు షాప్ ఓనర్.

"నీ మొహం, సినిమా హీరోయిన్లు చీరలుకట్టి చాలా రోజులయింది." విసుగ్గా అన్నాడు ఆమె భర్త. అసలే సినిమా ఛాన్సు పోయిందన్న కోపంతో.

కాని అతగాడి భార్యామణికి మాత్రం ఏచీరానచ్చడం లేదు. ఒక్కొక్క చీరా ఓపిగ్గా చూపిస్తున్నాడు షాప్ వాడు. "భార్యమణీ! మంచి అయిడియా! నువ్వు చీరలు చూస్తూ ఉండు, నే సినిమాచూసి వస్తా, ఇద్దరం కలసి ఇంటికి పోవచ్చు. నీ చీరల సెలక్షన్ ఇప్పట్లో అయ్యేదికాదుకదా".

"అయిడియా బాగానే ఉంది, ప్రొసీడ్, సినిమా చూసి తిన్నగా ఈ షాప్‌కి వచ్చేయండి" అంది.

"నాకు మాత్రం బాగాలేదు. మూడు గంటలసేపు నీకు చీరలు చూపించాలంటే నా తలప్రాణం తోకకు వస్తుంది" మనసులో గొణుక్కున్నాడు షాప్‌ఓనర్.

—ఇలుపిళ్ళ వెంకట చిన్నిశ్రీ.

తనకో నీతి పరులకో నీతి

సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ డాబా మీద పచార్లు చేస్తున్న నవీన్ దగ్గరికి సుచిత్ర పరుగెత్తుకుంటూ వచ్చింది.

"చూడండి! వాళ్ళు ..." దాదాపు ఏడుస్తున్న కంఠంతో ప్రారంభించింది.

"ఏమిటీ..." విసుగ్గా ముఖం పెట్టాడు భర్త.

"మరేమో ... నేను ... నేను స్నానం చేస్తుంటే ... ఆ కిటికీ దగ్గర గోల చేస్తున్నారు..."

స్కౌండ్రల్స్, ఇడియట్స్, డర్టీ ఫెలోస్ ... ఇప్పుడే వాళ్ళ పని చెప్తాను ..." చేతిలో కాలుతున్న సిగరెట్టు కాలికింద కసిగా నలిపేసి, గబగబా మెట్లు దిగి వీధిలో పడ్డారు...

"అయ్యో! నిదానంగా వాళ్ళకు బుద్ధి చెప్పండి ..."

సుచిత్ర మాటలు వినిపించుకోలేదు –

** ** **

అరగంట తర్వాత వగరుస్తూ, మట్టి కొట్టుకున్న బట్టలతో లోపలికి వచ్చాడు.

ఛేతి మీద అక్కడక్కడ గీసుకుపోయి రక్తం వస్తోంది. పెదవి చిట్టినట్లుంది. ఆయాసంతో రొప్పుతూ గబగబ బయట వున్న నీళ్ళ తొట్టి దగ్గరికి వెళ్ళాడు నవీన్.

భర్త వాలకం సుచిత్రకి గబరా పుట్టిస్తోంది. "ఉండండి! నేనీళ్ళు తెస్తున్నాను.. అంటూ నీళ్ళు తెచ్చేసరికి అప్పటికే నవీన్ తొట్టిలో వున్న చన్నీళ్ళతో తలారస్నానం చేసేసాడు.

అయ్యో! అంత ఘర్షణ ఎందుకు పడ్డారండీ ... నిదానంగా చెపితే పోయేది. రేపేదైనా అఘాయిత్యానికి పూనుకుంటారేమో?

నవీన్ ఏమీ మాట్లాడలేదు– ఇచ్చిన కాఫీ ఒక్క గుక్కలో తాగేసి మంచం మీద వాలిపోయాడు.

మరుసటి రోజు ఆఫీసుకు శెలవు పెట్టేసాడు. భోజనానికి పిలిచినా లేవలేదు... ఆలోచిస్తూనే ... వున్నాడు.

ఇంటికి బాత్‌రూం లేదు – తడికెలతో దడి కట్టించండి. ఇబ్బందిగా వుంది. అంటూ సుచిత్ర రోజూ పోరుపెడ్తూనే వుంది. అసలు రోజూ చీకటిలోనే లేచి తన పనులన్నీ ముగించుకుంటుంది సుచిత్ర. ఆలస్యమైన రోజూ ఇలాగే వస్తుంది ఏడుస్తూ. నిట్టూరుస్తూ అలాగే కూర్చుండిపోయింది సుచిత్ర.

"అక్కయ్యగారూ! మమ్మల్ని క్షమించండి" పక్కింటి కుర్రాళ్ళు.

బియ్యం ఏరుతూ వాకిట్లో కూర్చున్న సుచిత్ర ఆశ్చర్యపోయింది. వాళ్ళ మాటలకి! అర్థం కాని దానిలా చూసింది.

"మా ఇంట్లో ఆడవాళ్ళు స్నానం చేస్తుంటే రోజూ మీ వారు డాబా ఎక్కి ఇబ్బంది పెడ్తున్నారు. అందుకే మేము ఈ రోజు ఆయనకి తగిన గుణపాఠం చెప్పాలని అలా చేశాము. అంతేకాని. వేరే ఉద్దేశ్యంతో కాదు. ఏమీ బాధపడకండి వస్తాం" అంటూ వెళ్ళిపోయారు.

— పి. వెంకట శివరామయ్య

ఉత్తరాలు